క్లుప్తంగా

కనకదుర్గ ఆలయ హుండీ ఆదాయం రూ.89 వేలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాత బ్రిడ్జి రోడ్డులో ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయం హుండీల ఆదాయం మంగళవారం లెక్కించగా రూ.89,865 వచ్చినట్లు ఈఓ శ్యామలరావు తెలిపారు. మూడు నెలలకు గాను ఈ ఆదాయం వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ గురునాథరావు, ఆలయ ధర్మకర్త, అర్చకులు, పెద్దలు పాల్గొన్నారు.

స్తంభాలు సరిచేశారు



స్తంభాన్ని సరిచేస్తున్న విద్యుత్ సిబ్బంది

జి.సిగడాం: పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఒరిగి ఉండటంపై 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన ఈ నెల 23న సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జి.సిగడాం మండల విద్యుత్ శాఖ ఏఈఈ దుర్గాప్రసాద్ సిబ్బందిని పంపించి స్తంభాలను సరిచేయించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

చెరువుల్లో ఆక్రమణల గుర్తింపు


సర్వే చేపడుతున్న రెవెన్యూ సిబ్బంది

గార: రామచంద్రాపురం, వాడాడ పరిధిలో కృష్ణ సాగరం, కాశీసాగరం చెరువుల్లో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు మంగళవారం గుర్తించారు. స్థానిక రైతులు పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదు చేయడంతో తహశీల్దార్ ఆదేశాలతో వీరు పరిశీలన చేపట్టారు. వాడాడ గ్రామ రెవెన్యూ 336లో 1 సర్వే నంబర్‌లో 2.69 ఎకరాలు, 336లో 3.70 సెంట్లు స్థలానికి హద్దులు నిర్ణయించారు. వీటికి సంబంధించి పాసుపుస్తకాలు రద్దు చేయాలని రైతులు అధికారులను కోరారు.

మండల పరిధిలోనే బదిలీలు చేపట్టాలి


గారలో నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

గార: సచివాలయ ఉద్యోగులకు మండల పరిధిలోనే బదిలీలు చేపట్టాలని గార మండల సచివాలయ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు మంగళవారం గార మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం వద్ద ప్లకార్డులు ప్రదర్శన నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. జీవో 5ను సవరించాలని, పదోన్నతులు తర్వాతే బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బదిలీలకు గజిటెడ్ ఉద్యోగ స్థాయి నిబంధనలు పెట్టడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో ఏఎన్ఎం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ కవర్లు వాడితే కఠిన చర్యలు


షాపులో తనిఖీలు చేపడుతున్న హెల్త్ ఆఫీసర్ సుధీర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పాలిథిన్ కవర్లు వాడితే కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ సుధీర్ హెచ్చరించారు. కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలోని పలు దుకాణాల్లో మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు అమ్మకాలు చేయరాదని, మరోసారి పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలు వ్యాపార సంస్థలు, షాపులు, హోటల్స్, ఇతర వ్యాపార ప్రాంతాల్లో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు స్వాధీనం చేసుకొని అపరాధ రుసుము విధించారు. తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు పాల్గొన్నారు.

నిధుల విడుదలకు మోక్షమెప్పుడో?


గుజరాతీపేట జగన్నాథుని ప్రధాన ఆలయం

- అభివృద్ధికి దూరంగా గుజరాతీపేట జగన్నాథ ఆలయం
- రూ.12.94 లక్షలతో సీజీఎఫ్ నిధులకు ప్రతిపాదనలు
- రూ.3.25 లక్షలు మాత్రమే విడుదల
- అరకొరగా పనులు పూర్తి
- పట్టించుకోని దేవదాయ శాఖ


ఆలయం ముఖ ద్వారం


ఆలయ పరిసరాలు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోనే అతి పురాతన దేవాలయాల్లో ఒకటైన గుజరాతీపేట జగన్నాథ స్వామి ఆలయం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంటోంది. దేవదాయశాఖ నిర్వహణలో కొనసాగుతున్నప్పటికీ సరైన ఆదరణకు నోచుకోలేకపోతోంది. కేవలం భక్తులు, దాతలు అందిస్తున్న సాయంతోనే అడపాదడపా ఆలయంలో చిన్నచిన్న పనులు చేపడుతున్నారు. ముఖ్యంగా సీజీఎఫ్ నిధులు అరకొరగా విడుదల కావడంతో ఆలయంలో చేపట్టాల్సిన పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి.

గతమెంతో ఘనం..

గుజరాతీపేటలో జగన్నాథస్వామి దేవాలయానికి ఎంతో ఘన చరిత్ర ఉంది. తాటిరాజుల కాలంలో ఓ స్వామీజీ పూరీ నుంచి విగ్రహాలను తీసుకొచ్చి ఇక్కడ ప్రతిష్ఠించారట. వివిధ పనుల మీద ఇక్కడికొచ్చిన గుజరాతీ బ్రాహ్మణులలో ఓ స్త్రీ ఇక్కడి విగ్రహాలను దర్శించుకుని తననను కోర్టు కేసు నుంచి విముక్తి చేస్తే గుడి నిర్మిస్తానని మొక్కుకున్నారు. ఆమె ఆ కేసులో విజయం సాధించడంతో రూ. 500తో 1854లో దేవాలయాన్ని నిర్మించినట్లు చెబుతుంటారు. 1994 వరకు భట్ల విశ్వనాథం ధర్మకర్తగా పెంట వేంకటేశ్వరరావు కుటుంబం పూజారుల్లగా ఈ దేవాలయంలో పూజలు జరుగుతుండేవి. ప్రస్తుతం దేవదాయ శాఖ ఆధీనంలో నిర్వహిస్తున్నారు. హిందూ సంప్రదాయంలో పూజలు నిర్వహిస్తారు. శక్తిపథ ఆంజనేయస్వామి, శ్రీరామచంద్రులు ఆలయానికి క్షేత్రపాలకులుగా ఉన్నారు.

మూలకు చేరిన ప్రతిపాదనలు..


క్షేత్రపాలకులు శక్తిపథ ఆంజనేయుడు

అతిపురాతన జగన్నాథస్వామి దేవాలయం జీర్ణావస్థకు చేరుకుంటున్న నేపథ్యంలో గుడిని అభివృద్ధి చేయాలని భక్తులు నిర్ణయించారు. ఈ మేరకు దేవదాయశాఖ అధికారులతో చర్చించి కామన్ గుడ్ ఫండ్ నుంచి నిధులు విడుదల చేసేందుకు అప్పట్లో సీజీఎఫ్ కింద రూ.12.94 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేశారు. అందులో రూ.3 లక్షల 25 వేలు మాత్రమే విడుదల కావడంతో అంతరాలయం, గర్భాలయం పునర్నిర్మాణం చేపట్టారు. విగ్రహాల పునఃప్రతిష్ఠ, గోపుర కలశం ఏర్పాటు చేయించారు. ఆ తర్వాత నిధులు విడుదల కాకపోవడంతో దాతలే దిక్కయ్యారు. వారి సహకారంతోనే ఆలయ పరిసరాల్లో సిమ్మెంట్ గచ్చులు వేశారు. రామాలయం, శక్తిపథ ఆంజనేయస్వామి ఆలయాలను అభివృద్ధి చేశారు. మిగతా నిధులు విడుదలైతే ముఖమండపం, టైల్స్ వంటి పనులు చేయాల్సి ఉంది. త్వరలో జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

భక్తుల సహకారంతో..



ఏడాదికొకసారి జరిగే జగన్నాథుని ఉత్సవాలలో అమ్మవారి ఊరేగింపు కోసం నూతనంగా సవారిని భక్తుల సహకారంతో ఏర్పాటు చేశాం. ఇంకా ఆలయం అభివృద్ధి చెందాల్సి ఉంది.

– పెంట రాజగోపాలశర్మ, అర్చకులు, జగన్నాథ ఆలయం, గుజరాతీపేట


క్షేత్రపాలకులు శ్రీరామచంద్రుడు

రేపటి నుంచి వారాహి నవరాత్రి ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరాన ఉన్న బాలాత్రిపుర కాలభైరవస్వామి పీఠం దేవాలయంలో ఈ నెల 26 నుంచి వారాహి నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఒక ప్రకటనలో తెలిపారు. కుంకుమ పూజల్లో మహిళలంతా పాల్గొనాలని కోరారు.

కామాక్షిదేవి పీఠంలో..

నగరంలోని పాండ్రంగి వీధిలో కామాక్షిదేవి పీఠంలో వారాహి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఈ నెల 26 నుంచి జూలై 16 వరకు లలితా సహస్ర నామ కోటి పారాయణలు జరుగుతాయని నిర్వాహకులు వేదుల సూర్యనారాయణశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 7.30 గంటల వరకు పారాయణలు జరుగుతాయని, భక్తులంతా పాల్గొనాలని కోరారు.


వారాహి అమ్మవారు

కార్మికుల తొలగింపు అన్యాయం


కార్మికులతో మాట్లాడుతున్న ఎస్సై చిరంజీవి

రణస్థలం: పైడి భీమవరం పారిశ్రామికవాడలో శేష సాయి కెమికల్స్ పరిశ్రమలో అక్రమంగా తొలగించిన 11 మంది ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పరిశ్రమ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మన్నాయుడు మాట్లాడుతూ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, వీడీఏ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు చేయకుండా పరిశ్రమ నడపడం కార్మిక చట్టాలు ఉల్లంఘించడమేనన్నారు. వేతనాలు పెంచాలని కోరితే ఉద్యోగులపై బెదిరింపులకు పాల్పడుతూ అక్రమంగా 11 మందిని నిలుపుదల చేయడం అన్యాయమన్నారు. యాజమాన్యం వెంటనే కార్మికులతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాగా, పరిశ్రమ వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జె.ఆర్.పురం ఎస్సై ఎస్. చిరంజీవి బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో కార్మికులు కె.జనార్దనరావు, ఎ.నారాయణరావు, సీహెచ్ అమ్మలనర్సయ్య, బి.రాజారావు, ఎం.అప్పలరాజు, జి.శశిధర్, ఆర్.పవన్ సీతారాం, ఐ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల బైక్ ర్యాలీ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 41 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వై.శ్యామలరావు, ఆర్.సతీష్ అన్నారు. ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేసి విధుల్ని పూర్తి స్థాయిలో బహిష్కరిస్తామన్నారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరంలో మున్సిపల్ కార్యాలయం నుంచి ఏడురోడ్ల కూడలి మీదుగా డే అండ్ నైట్, కిమ్స్‌రోడ్డు, పాలిటెక్నిక్ కాలేజీ రోడ్డు, పాత బ్రిడ్జిపై బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి టెక్నికల్ సిబ్బందికి రూ.29,200, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.24500 జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేయాలని కోరారు. తక్షణమే యూనియన్ నాయకులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

29న పుస్తకావిష్కరణలు

శ్రీకాకుళం కల్చరల్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 29న శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో పుస్తకావిష్కరణలు జరుగుతాయని అధ్యక్ష కార్యదర్శులు ఎం.మదన్మోహన్, ఎస్.వి.అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ ఏపీటీఎఫ్ నాయకులు, పూర్వ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ 'ఉరికంబం సాక్షిగా' 'గీసి చెరిపే బొమ్మ' పుస్తకాల ఆవిష్కరణకు ఉపాధ్యాయులు, సాహితీ అభిమానులు, రచయితలు, కవులు హాజరుకావాలని కోరారు.

మోడల్ స్కూల్ పరీక్షకు 100 మంది హాజరు

జి.సిగడాం: స్థానిక ఆంధ్రప్రదేశ మోడల్ స్కూల్లో 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్లు భర్తీ చేసేందుకు మంగళవారం నిర్వహించిన ప్రవేశపరీక్షకు విశేష స్పందన లభించింది. 100 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

జి.సిగడాం: పరిసరాల పరిశుభ్రతకు అందరి సహకారం అవసరమని జి.సిగడాం సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, పంచాయితీ కార్యదర్శి తులసీప్రసాద్‌సాహు అన్నారు. మంగళవారం గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయించారు. వర్షాలు నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తాగునీటి వనరుల వద్ద బ్లీచింగ్ చేయించారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ


పెంట గ్రామ పాఠశాలలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని పెంట, జి.సిగడాం, జాడ, సంతవురిటి, వాండ్రంగి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సాకేటి నాగరాజు, పున్నాన సోనియా, నాయకులు బూరాడ వెంకటరమణ, మక్క నారాయణరావు, పున్నాన అక్కలనాయుడు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటితీరువా వసూళ్లపై దృష్టి సారించాలి

జి.సిగడాం: గ్రామాల్లో రైతుల నుంచి నీటితీరువా వసూలు చేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే వీఆర్‌ఓలపై చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం.సరిత హెచ్చరించారు. మంగళవారం రెవెన్యూ కార్యాలంలో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. రైతుల సమస్యలపై దృష్టి సారించి సకాలంలో పరిష్కారమయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు.

కుళాయి తవ్వేసి.. అలాగే వదిలేసి..



అరసవల్లి ప్రశాంతినగర్‌లో షిర్డీసాయి బాబా ఆలయం వద్ద కుళాయిని సీసీ రోడ్డు విస్తరణ పనుల పేరుతో మున్సిపల్ అధికారులు రెండు వారాల కిందట తవ్వేశారు. తిరిగి ఇంత వరకు అమర్చలేదు. సిబ్బందికి పలుమార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కుళాయి మరమ్మతు చేయించాలని ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు.

– అరసవల్లి

పొలాల్లో బిజీబిజీ



ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పొలం పనుల్లో బిజీబిజీగా ఉంటున్నారు. గట్లు సరి చేయడం, విత్తనాలు చల్లడం వంటి పనుల్లో నిమగ్నమవుతున్నారు. రెండు మూడు రోజులుగా జల్లులు పడుతుండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – జి.సిగడాం

రాష్ట్రంలో రెడ్‌బుక్ పరిపాలన


తెప్పలవలస గ్రామ నాయకులతో మాట్లాడుతున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: కూటమి ప్రభుత్వంలో గ్రామాభివృద్ధిని విస్మరించి రెడ్‌బుక్ పాలన నడిపిస్తున్నారని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ధ్వజమెత్తారు. రణస్థలం మండల కేంద్రంలోని తెప్పలవలస పంచాయతీ నాయకులతో మంగళవారం 'కార్యకర్తే కీలకం' సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో తెప్పలవలస పంచాయతీలో 80 శాతం సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం పూర్తయ్యిందన్నారు. మిగిలిన 20 శాతం పాపారావుపేట, మీసాలబడి వంటి గ్రామాల్లో రోడ్లు వేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు, నాయకులతో సమన్వయం చేసుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.కార్యకర్తలకు ఏటువంటి కష్టం వచ్చినా అండగా నిలవాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, ఎచ్చెర్ల నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు దన్నాన హరి, సర్పంచ్ ప్రతినిధి బొమ్మలాట శ్రీరాములు, నాయకులు మీసాల గాంధీ, ఆబోతుల రామునాయుడు, యాగాటి తవుడు, తోట ఆదినారాయణ, అప్పన్న, ధర్మవరపు సింహాద్రి, పట్నాన పెంటయ్యరెడ్డి, యాగాటి అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

సోదరభావంతో మెలగాలి


బ్రదర్హీ హుడ్ డే కార్యక్రమంలో పాల్గొన్న ఫ్రీమాసన్లు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రపంచమంతటా సోదర భావనను చాటిచెప్పే ఉద్దేశంతో ప్రతి ఏడాది జూన్ 24న నిర్వహించే విశ్వజన సోదరత్వ దినోత్సవం (యూనివర్సల్ బ్రదర్ హుడ్ డే)ను ఫ్రీమాసన్లు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రీమాసన్లు మాట్లాడుతూ మానవాళి మధ్య ప్రేమ, ఓర్పు, సహనంతో కూడిన బంధం అవసరమన్నారు. భౌగోళిక, మత, భాషా, రాజకీయ భేదాలకు అతీతంగా సమాజం ముందుకు సాగాలన్నారు. అనంతరం స్మృతి ఫలకాలు, క్రీడా బహుమతుల ప్రదానోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన డాక్టర్ కళ్యాణబాబు, కూటికుప్పల సురేష్ కుమార్, మోనంగి రాంజీ తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో వారణాసి నరసింహం, వరద వెంకట గోవిందరాజులు, ప్రళయకావేరి శివకుమార్, కె.సుభాష్, బుర్రా ఆదినారాయణ శాస్త్రి, ఐ.కె.రావు తదితరులు పాల్గొన్నారు.

కర్మ కంటే జ్ఞానం గొప్పది

శ్రీకాకుళం కల్చరల్: సనాతన ధర్మంలో కర్మ కంటే జ్ఞానం గొప్పదని మైసూరుకు చెందిన సంతోష్‌కుమార్ ఘనాపాఠి అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో శృంగేరి ఉభయ జగద్గురువుల పరిపూర్ణ అనుగ్రహంతో అహం బ్రహ్మాస్మి సీఈవో పి.ఎ.మురళి నిర్వహణలో శ్రీశంకర విజయంపై మంగళవారం ప్రవచనాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైదిక ధర్మంలో 72 మతాలు వేర్వేరుగా ఉన్న భావాలను ఒకే తాటిపైకి తీసుకొచ్చి సమైక్యత కోసం ప్రయత్నించిన మహనీయులు శంకరాచార్యులని కొనియాడారు. అంతకు ముందు మహిళలు సామూహిక లలితా సహస్ర నామ పారాయణ చేశారు. కార్యక్రమంలో అరసవల్లి దేవస్థానం ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, భాస్కరభట్ల శ్రీరామశర్మ, రుద్రభట్ల నాగేశ్వరశర్మ, పెంట రామచంద్రశేఖరశర్మ, వాశిష్ట కార్తికేయశర్మ, నిష్టల నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.


సంతోష్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఇప్పిలి శంకరశర్మ తదితరులు

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

జి.సిగడాం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి బెండి బాబ్జీ అన్నారు. మంగళవారం ఆనందపురం రైతు సేవా కేంద్రం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంత్రాల ద్వారా వ్యవసాయం సాగు చేసుకుంటే సమయం ఆదా కావడంతో పాటు మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిత్తిరి మంజు, అగ్రికల్చర్ అసిస్టెంట్ ముంతా హేమంత్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.